క్లుప్తంగా

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): జిల్లాలోని నిరుద్యోగ యువతకు, విద్యార్థులకు స్క్రీన్ ప్రింటింగ్, పెయింటింగ్ ఆర్టికల్స్ కోర్సుల్లో ఉచిత శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నామని జనశిక్షణ సంస్థాన్ డైరెక్టర్ ఏ.పూర్ణిమ ఓ ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణ తరగతులు ఈ నెల 28వ తేదీ నుంచి ప్రారంభమవుతాయని పేర్కొన్నారు. విజయవాడ మొగల్రాజపురం రావిచెట్టు సెంటర్‌లో ఉన్న తమ సంస్థ కార్యాలయంలోనే ఈ శిక్షణ తరగతులు జరుగుతాయని, ఆసక్తి ఉన్న వారు 28వ తేదీలోగా తమ సంస్థ కార్యాలయానికి స్వయంగా వచ్చి దరఖాస్తు చేసుకోవాలని తెలియజేశారు. వివరాలకు 0866–2470240లో సంప్రదించాల్సిందిగా ఆమె కోరారు.

రోలర్ స్కేటింగ్‌లో చిన్నారి ప్రతిభ



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): తమ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్న షేక్ అబ్దుల్ రయ్యాన్ రోలర్ స్కేటింగ్ రాష్ట్రస్థాయి చాంపియన్‌షిప్‌లో ద్వితీయ బహుమతిని సాధించినట్లు రాయల్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్ ఎండీ షాహీన్ తెలిపారు. హైదరాబాద్ యూత్ రోలర్ స్కేటింగ్ ఫౌండేషన్ ఇటీవల ఈ పోటీలను నిర్వహించినట్లు పేర్కొన్నారు. బహుమతిని సాధించిన అబ్దుల్ రయ్యాన్‌కి ప్రశంసా పత్రం, జ్ఞాపికను అందించారని తెలిపారు.

ఉచిత వేసవి శిక్షణ తరగతులు

సత్యనారాయణపురం(విజయవాడపశ్చిమ): అన్నసంతర్పణ సమితి ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవిలో ఉచిత శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ట్రస్ట్ అధ్యక్షులు గుండు దిలీప్ ఓ ప్రకటనలో తెలిపారు. మధురానగర్‌లోని మోడరన్ మార్కెట్ ఎదురుగా ఉన్న విజయ నర్సింగ్ కాలేజీలో నిర్వహించే ఈ తరగతులలో ఒకటో తరగతి నుంచి పదో తరగతి విద్యార్థులకు వెస్ట్రన్ డ్యాన్స్, ఫోక్ డ్యాన్స్, దాండియా, జానపదం, డ్రాయింగ్, కేలియోగ్రఫీ, క్రాఫ్ట్ వర్క్, క్లే వర్క్, స్పోకెన్ ఇంగ్లిష్, కరాటేలలో శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. నగరంలోని విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆసక్తి కలిగిన వారు స్వయంగా తమ పిల్లలను తీసుకుని మే 1న పేర్లు నమోదు చేసుకోవాల్సిందిగా సూచించారు. ఇతర వివరాలకు 8247500651లో సంప్రదించాల్సిందిగా కోరారు.

రాయితో దాడిపై కేసు నమోదు

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): గొడవ వద్దని వారించినందుకు యువకుడిపై రాయితో దాడికి పాల్పడిన ఘటనపై కొత్తపేట పోలీసులు బుధవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం జక్కంపూడి కాలనీ బ్లాక్ నంబర్:136లో గుర్రం శివ కుటుంబం నివాసం ఉంటోంది. శివ రాడ్ బెండింగ్ పని చేస్తుంటాడు. మంగళవారం రాత్రి కొత్త రాజరాజేశ్వరిపేటలో బంధువుల ఇంట్లో ఫంక్షన్‌కు వెళ్లి తిరిగి వస్తూ మార్గమధ్యలోని కీర్తి బార్ వద్ద మద్యం కొనుగోలు చేసేందుకు ఆగాడు. ఆ సమయంలో శివతో పాటు అతని మేనల్లుడు సంపంగి శశి కూడా వెంట ఉన్నాడు. బార్‌లో మద్యం కొనుగోలు చేసుకుని బయటకు వచ్చే క్రమంలో బార్ వద్ద ఇద్దరు వ్యక్తులు గొడవ పడుతూ కనిపించారు. దీంతో శివ వారి మధ్యకు వెళ్లి గొడవ సరి చేసేందుకు ప్రయత్నించగా, ఇద్దరిలో ఒక వ్యక్తి రాయి తీసుకుని దాడికి పాల్పడ్డాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): పశ్చిమ గోదావరి జిల్లా గోపాలపురం మండలం కరిచర్ల గూడేనికి చెందిన గడిమి గెవట రాజు తాపీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 20వ తేదీన తన సోదరుడు మరో ఇద్దరితో కలిసి నందిగామ ఏరియాలో తాపీ పనులు చేయడానికి వెళ్లారు. తిరిగి బైక్‌పై వస్తుండగా గొల్లపూడి బైపాస్ రోడ్డు సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన కారు బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ఘటనలో గెవటరాజు చేతికి గాయాలయ్యాయి. పక్కన ఉన్న వాళ్లు అతనిని భవానీపురంలోని భవానీ హాస్పిటల్ నందు చేర్పించారు. కారు నడిపిన వ్యక్తి వచ్చి గెవటరాజుకు రూ. వెయ్యి ఇచ్చి తనకు అర్జెంట్ పని ఉందని చెప్పి ఫోన్ నంబర్ ఇచ్చి వెళ్లాడు. ఆ తర్వాత కారు డ్రైవర్ ఫోన్ ఎత్తడం లేదు. ఈ ఘటనపై భవానీపురం పోలీసులు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గెవటరాజు వద్ద స్టేట్‌మెంట్ తీసుకొని కేసు నమోదు చేశారు.

యువకుడు అదృశ్యం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఇంటి నుంచి బయటకు వెళ్లిన యువకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలు.. భవానీపురం రామరాజ్యనగర్‌కు చెందిన సిద్దుల వెంకటరాము డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉన్నాడు. ఈనెల 18వ తేదీన బయటకు వెళ్లి వస్తానని తల్లితో చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. మధ్యాహ్న సమయంలో యువకుడు తండ్రి శ్రీను ఫోన్ చేయగా కొంతసేపటి తర్వాత ఇంటికి వస్తానని చెప్పి ఫోన్ పెట్టేశాడు. ఆ రోజు రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో మరలా ఫోన్ చేశాడు. కానీ ఫోన్ స్విచ్ఛాఫ్ వచ్చింది. అప్పటి నుంచి వెంకటరాము ఆచూకీ కోసం స్నేహితులు, బంధువులు, తెలిసిన వారిని ఆరా తీశారు. అప్పటి నుంచి ఆచూకీ లభించకపోవడంతో వెంకటరాము తండ్రి సిద్దుల శ్రీను భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతని ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేశారు.

కంపుకొడుతున్న పండ్ల మార్కెట్

- ఎక్కడ చూసినా గుట్టలుగా వ్యర్థాలు
- బహిరంగంగానే మలమూత్ర విసర్జన
- పట్టించుకోని నగరపాలక సంస్థ అధికారులు

కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో అధ్వానంగా పారిశుద్ధ్యం



కల్యాణ మండపం ఎదుట మలమూత్ర విసర్జనలతో వెదజల్లుతున్న దుర్గంధం

పూర్ణానందంపేట(విజయవాడపశ్చిమ): రాష్ట్రంలోనే అతిపెద్ద పండ్ల మార్కెట్‌గా ప్రసిద్ధిగాంచిన నగరంలోని కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లో పారిశుద్ధ్యం రోజురోజుకీ దిగజారుతోంది. మార్కెట్‌లో ఏ సందు చూసినా గుట్టలు గుట్టలుగా వ్యర్థాలు దర్శనమిస్తున్నాయి. కుళ్లిపోయిన పండ్లు, పండ్ల లోడుతో పాటు వచ్చే గడ్డి, ఆకులను మార్కెట్ పరిసర ప్రాంతంలోనే పడేస్తుండటంతో అవి కుళ్లి తీవ్ర దుర్గంధం వెదజల్లుతున్నాయి. దీంతో మార్కెట్‌కు వచ్చే వినియోగదారులు ముక్కు మూసుకుని నడవాల్సిన పరిస్థితి నెలకొంటోంది.

టన్నుల కొద్దీ వ్యర్థాలు..

మామిడి పండ్ల సీజన్ కావటంతో రాష్ట్ర నలుమూలల నుంచి వందల సంఖ్యలో లారీల ఎగుమతులు, దిగుమతుల కోసం వస్తుంటాయి. మిగిలిన పండ్ల కోసం కూడా పెద్ద ఎత్తున వాహనాలు రాకపోకలు చేస్తుంటాయి. దీంతో మార్కెట్ నిత్యం రద్దీగా ఉంటుంది. ఫలితంగా రోజు టన్నుల కొద్దీ వ్యర్థాలు కూడా వస్తుంటాయి. వీటిని ఎప్పటికప్పుడు తొలగించాల్సిన నగరపాలకసంస్థ సిబ్బంది పట్టించుకోకపోవడం పట్ల పండ్ల మార్కెట్ అసోసియేషన్ సభ్యులే అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. వ్యర్థాలను తొలగించేందుకు ఏటా కార్పొరేషన్‌కు వేలాది రూపాయలు చెల్లిస్తున్నా, నగరపాలకసంస్థ అధికారులు పారిశుద్ధ్య సమస్య నివారించడంలో అశ్రద్ధ వహిస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

బహిరంగ మూత్ర విసర్జన..

మార్కెట్‌లో ఎక్కడ చూసినా బహిరంగ మలమూత్ర విసర్జనలు చేస్తుండటంతో మార్కెట్ ప్రాంతం తీవ్ర దుర్గంధ భరితంగా మారుతోంది. దూర ప్రాంతాల ఉంచి లారీలను తీసుకువచ్చే డ్రైవర్లు, క్లీనర్‌లు ఈ బహిరంగ మలమూత్ర విసర్జనలకు పాల్పడుతున్నారని స్థానికులు చెబుతున్నారు.



పండ్ల మార్కెట్‌లో గుట్లలు గుట్టలుగా వ్యర్థాలు

అధికారులకు కనపడదు..

పండ్ల మార్కెట్‌లో పారిశుద్ధ్య సమస్య తిష్ట వేసి వినియోగదారులకు అసౌకర్యంగా ఉన్నా నగరపాలక సంస్థ అధికారులు ఏమాత్రం పట్టించుకోవట్లేదు. పారిశుద్ధ్య సిబ్బంది ఇటువైపు కన్నెత్తి చూడటం లేదని, నెల నెలా మామూళ్లకు మాత్రం హాజరవుతుంటారని పండ్ల వ్యాపారులు చెబుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మార్కెట్‌లో నెలకుంటున్న పారిశుద్ధ్య సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.

ఆదరణ కోల్పోతున్న కల్యాణ మండపం..

పండ్ల మార్కెట్ ఆవరణలో నగరపాలకసంస్థ ఏర్పాటు చేసిన వీఎం రంగా మ్యాంగో మార్కెట్ కల్యాణ మండపం గతంలో పెళ్లిళ్లు, ఫంక్షన్‌లతో కళకళలాడుతుండేది. ప్రస్తుతం మార్కెట్‌లో తిష్ట వేస్తున్న వ్యర్థాలు, అవి వెదజల్లుతున్న దుర్గంధంతో పాటు కల్యాణ మండపం చుట్టు నెలకుంటున్న అపరిశుభ్రత కారణంగా ఇక్కడ వేడుకలు చేసుకునేందుకు ఎవరూ ముందుకు రావటం లేదు. దీంతో నగరపాలకసంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతోంది.



మార్కెట్ ఆవరణలోని నగరపాలకసంస్థ కల్యాణ మండపం

ముక్కు మూసుకోవాల్సిందే..



కేదారేశ్వరపేట పండ్ల మార్కెట్‌లోకి అడుగు పెట్టాలంటేనే భయమేస్తోంది. పది నిమిషాలు కూడా మార్కెట్‌లో తిరగలేని పరిస్థితి నెలకొంది. ముక్కు మూసుకుని పండ్లను కొనుగోలు చేసుకుని వెంటనే తిరిగి వస్తున్నాం. అధికారులు స్పందించి, పరిస్థితి మెరుగుపరచాలి.

– థామస్, వినియోగదారుడు

ఇంత దారుణమా?



రాష్ట్రంలోనే అతి పెద్ద మార్కెట్‌గా ప్రసిద్ధి చెందిన విజయవాడ పండ్ల మార్కెట్‌లో ఇటువంటి పరిస్థితులు ఉంటాయని ఎవరు అనుకోరు. ఎక్కడ చూసినా గుట్టలు గుట్టలుగా చెత్త కుప్పలు, కుళ్లిన పండ్లతో మార్కెట్ దర్శనమిస్తోంది. నగరపాలకసంస్థ దీనిని ఏమాత్రం పట్టించుకోకపోవడం దారుణం.

– జయప్రకాష్, వినియోగదారుడు

చర్యలు తీసుకుంటాం..

ఈ మూడు నెలల పాటు పండ్ల మార్కెట్‌కు సీజన్ ఉంటుంది. దీని వల్ల మార్కెట్‌లో వ్యర్థాలు ఎక్కువగా వస్తుంటాయి. ప్రతి రెండు రోజులకు ఒక సారి వాటిని తొలగిస్తున్నాం. పండ్ల మార్కెట్ అసోసియేషన్ వారితో మాట్లాడి లారీలను కల్యాణ మండపం వద్ద నిలపకుండా చేసి డ్రైవర్లు, క్లీనర్‌లు మలమూత్ర విసర్జనలు చేయకుండా చర్యలు తీసుకుంటాం.

– ఆదినారాయణ, 34వ డివిజన్ శానిటరీ ఇన్‌స్పెక్టర్

విద్యార్థులకు పుస్తకాలు నేస్తాలు కావాలి



వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): విద్యార్థులకు పుస్తకాలు నేస్తాలు కావాలని, అప్పుడే విజ్ఞానంతో పాటు అనేక అంతర్గత శక్తుల ఉద్దీపన కూడా జరుగుతుందని ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగాధిపతి వెంపటి శ్రీసాయి అన్నారు. కేబీఎన్ కళాశాల తెలుగు, గ్రంథాలయ విభాగాల సంయుక్త నిర్వహణలో బుధవారం ప్రపంచ పుస్తక దినోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న శ్రీసాయి మాట్లాడుతూ పుస్తక పఠనం వ్యక్తిత్వ వికాసం సాధ్యమవుతుందన్నారు. జీవితంలోని ప్రతి దశలో విద్యార్థులకు తోడుగా ఉంటూ, భావోద్వేగాలను నియంత్రిస్తాయన్నారు. ప్రిన్సిపాల్ డాక్టర్ జి. కృష్ణవేణి మాట్లాడుతూ పుస్తక పఠనం జీవితాన్ని చక్కటి మలుపు తిప్పుతుందన్నారు. గ్రంథాలయ అధికారి శ్రీనివాసరాజు మాట్లాడుతూ ఈ–బుక్స్ వంటి సాంకేతిక ఆవిష్కరణలు ఎన్ని వచ్చినా.. అవి పుస్తకానికి ప్రత్యామ్నాయం కాలేవన్నారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం



పటమట(విజయవాడతూర్పు): ప్రతి ఒక్కరూ జీవితంలో క్రీడలకు అత్యున్నత స్థానం ఇవ్వాలని, ఉద్యోగులు కూడా క్రీడల్లో పాల్గొనటం ద్వారా మానసిక, శారీరక ఒత్తిడి తగ్గుతుందని కాలుష్య నియంత్రణ మండలి చైర్మన్, విశ్రాంత ఐఏఎస్ అధికారి పి. కృష్ణయ్య అన్నారు. ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి క్రీడాపోటీలను ఆయన సాయిసందీప్ బ్యాడ్మింటన్ అకాడమీలో బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిభకు వయస్సు అడ్డుకాదని, ప్రతి ఒక్కరూ క్రీడల్లో పాల్గొనాలని అన్నారు. అనంతరం ఆయన పీసీబీ ఉద్యోగులకు క్రికెట్, బ్యాడ్మింటన్, కేరమ్స్, చెస్, పరుగు పోటీలను ప్రారంభించారు. ఆయా పోటీల్లో గెలుపొందిన వారికి ఈ నెల 27వ తేదీన విశాఖపట్నం వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని అన్నారు. కాలుష్య నియంత్రణ మండలి ఉన్నత అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఉగ్రదాడిని నిరసిస్తూ క్యాండిల్ ర్యాలీ

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదుల దాడి పిరికిపందల చర్య అని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖాదర్‌బాషా అన్నారు. ఎంసీపీఐ(యూ) ఆధ్వర్యంలో ఉగ్రవాదుల దాడిలో ప్రాణాలు కోల్పోయిన వారికి ఆత్మశాంతి కలగాలని కోరుతూ క్యాండిల్ ర్యాలీని బుధవారం రాత్రి నిర్వహించారు. ఖాదర్‌బాషా మాట్లాడుతూ ఉగ్రవాదులదాడుల వల్ల 26 మంది ప్రాణాలు పోగొట్టుకోవటం యావత్ దేశాన్ని కలిచివేసిందన్నారు. అమాయక ప్రాణాలు తీయటం ఏ మత గ్రంథంలో లేదన్నారు. ఒక మానవుని చంపితే సమస్త మానవులను చంపినట్లేనన్నారు. జమ్మూ కశ్మీర్‌లో నిఘా వ్యవస్థను పెంచాలన్నారు. ఉగ్రవాదులపై చర్యలు తీసుకోవాలన్నారు. అలాగే విదేశీ పర్యటకులకు ధైర్యం ఇవ్వాలని కోరారు. నాయకులు సలీమ్, అజాజ్, వాహేద్, వానపల్లి గంగాధర్, ఫరూక్, సమద్, అజ్మి, తాజ్, తాహేర్ తదితరులు పాల్గొన్నారు.



పంజా సెంటర్‌లో క్యాండిల్ ర్యాలీ

నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో..

దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని నగర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు నరహరిశెట్టి నరసింహారావు అన్నారు. కశ్మీర్ ఉగ్రవాద దాడిలో చనిపోయిన 30 మందికి శాంతి చేకూర్చాలని నగర కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో పాతబస్తీ కాళేశ్వర్ మార్కెట్ వద్ద ఉన్న గాంధీ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో శాంతి ప్రదర్శనను బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు గురునాథం, అన్సారి, బషీర్ అహ్మద్, గణేష్, సునీత, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.

కశ్మీర్‌లో ఉగ్రదాడి దుర్మార్గం..

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): జమ్మూ కశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదులు దాడి అత్యంత దుర్మార్గమని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ పోతిన మహేష్ పేర్కొన్నారు. దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. దాడిలో మరణించిన వారికి తన సంతాపాన్ని ప్రకటిస్తున్నట్లు తెలిపారు. మత ప్రాధాన్యంగా జరిగే ఇట్లాంటి దాడుల్ని ముస్లిం సమాజం, ముస్లిం సంస్థలు తీవ్రంగా ఖండించాలన్నారు. లేకపోతే దేశంలో సమైక్యతకు భంగం వాటిల్లే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. హక్కుల కోసం పోరాడినట్టే ఇస్లాం మతాన్ని దెబ్బతీసే ఇలాంటి తీవ్రవాద చర్యలపై కూడా ముస్లిం సమాజం గళమెత్తాలని పేర్కొన్నారు. సాధారణ ప్రజలను చంపి భారతదేశానికి సవాల్ విసిరిన ఇలాంటి టెర్రరిస్టులను ఏమాత్రం ఉపేక్షించరాదని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

చార్లెస్ శోభరాజ్ భవన్ అని నామకరణం చేయండి

విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై సోషల్ మీడియా వేదికగా మాజీ ఎంపీ నాని విమర్శనాస్త్రాలు

విజయవాడస్పోర్ట్స్: గురునానక్ కాలనీలోని ఎన్టీఆర్ భవన్‌లో కూర్చొని అక్రమ ఇసుక, ఫ్లై యాష్ తోలకం, గ్రావెల్ అమ్మకాలు, భూ దందాలు, బ్రోకరేజీలు, పేకాట శిబిరాలు నిర్వహిస్తూ, రేషన్ బియ్యం మాఫియాకు కొమ్ము కాస్తూ అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై మాజీ ఎంపీ కేశినేని నాని ఫేస్‌బుక్, ఎక్స్ వేదికగా విమర్శనాస్త్రాలు సంధించారు. విజయవాడ ప్రజలు చరిత్రలో లేని విధంగా భారీ మెజారిటీతో తనను గెలిపించుకున్నారని గర్వంగా చెప్పుకునే ప్రజా ప్రతినిధి కార్యాలయం పేరు 'ఎన్టీఆర్ భవన్' అని పోస్ట్‌లో పేర్కొన్నారు. తెలుగు ప్రజల ఆరాధ్య దైవం, నీతి, నిజాయితీకి మారుపేరు, ప్రజా సేవ అంటే చాలా పవిత్రమైన కార్యక్రమం అని ప్రపంచానికి చాటిన మహానుభావుడు ఎన్టీఆర్ అని, ఆయన పేరును కార్యాలయానికి పెట్టుకుని ఆ కార్యాలయంలో కూర్చుని అక్రమ దందాలకు పాల్పడుతుండటాన్ని తప్పుబట్టారు. కార్యాలయానికి వెంటనే ఎన్టీఆర్ పేరును తొలగించి ప్రపంచ స్థాయి స్మగ్లర్ అయిన 'చార్లెస్ శోభరాజ్' పేరును కార్యాలయానికి పెట్టుకుంటే బాగుంటుందని సూచించారు. ఇది విజయవాడ ప్రజల కోరికగా పోస్ట్‌లో అభివర్ణించారు.

'పది' ఫలితాలపై పాఠశాలల్లో సంబరాలు



సత్తా చాటిన శ్రీచైతన్య విద్యార్థులతో యాజమాన్యం



విద్యార్థులకు పుష్పగుచ్ఛమిచ్చి అభినందిస్తున్న హెచ్ఎం కోటయ్య



బాణాసంచా కాల్చి వేడుకలు జరుపుతున్న రాకేష్ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు

భవానీపురం(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్షా ఫలితాలలో వెలువడిన సందర్భంగా పలు పాఠశాల విద్యార్థులు బుధవారం సంబరాలు చేసుకున్నారు. విద్యాధరపురంలోని దళవాయి సుబ్బరామయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్ విద్యార్థులు 88 శాతం ఉత్తీర్ణత నమోదు చేశారు. కామినేని సుమంత్ 578, మచ్చ దుర్గాప్రసాద్ 564, వెన్న జయశ్రీ 559, ఆర్. శ్యామ సుష్మ 555, జి. పవిత్ర 551 మార్కులు సాధించారు. కాగా వీరందరి తల్లిదండ్రులు రోజువారీ కూలీలు కావడం గమనార్హం. విద్యార్థులను స్కూల్ హెచ్ఎం మాతంగి కోటయ్య, పదో తరగతి ఉపాధ్యాయులు అభినందించారు.

- విద్యాధరపురంలోని బెజవాడ రాజారావు హైస్కూల్ విద్యార్థి సంగిరెడ్డి గురుకార్తికేయ 590 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచాడు. అలాగే విశ్వనాధుల రిషిత 578, మల్లవరపు ప్రణవి 565 మార్కులు సాధించి ద్వితీయ స్థానంలో నిలిచారు. విద్యార్థులను స్కూల్ కరస్పాండెంట్ బెజవాడ రాజారావు, సెక్రటరీ శ్యామ్‌ప్రకాష్, చక్రధర్ ప్రసాద్, డీన్ రంగారావు, సీ బ్యాచ్ ఇన్‌ఛార్జ్ నాగేశ్వరరావు అభినందించారు.



ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు మిఠాయిలు తినిపిస్తున్న సూర్యారావు, ఉపాధ్యాయులు

ప్రిన్సిపాల్ లక్ష్మి ప్రసన్న అభినందించారు.

- భవానీపురంలోని శ్రీచైతన్య పాఠశాలలో 99.7 శాతం ఉత్తీర్ణత నమోదు చేసుకున్నారు. సీహెచ్ నిషిత 594, ఎస్‌వీఎస్ఎస్ ఆదిత్య 592, పి. చాముండేశ్వరి, జి.హేమ హారిక 591 మార్కులు సాధించారు. బుధవారం పాఠశాలలో జరిగిన అభినందన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యచిత్ర, ఈజీఎం మురళీకృష్ణ, ఆర్ఐ వినోద్, కో ఆర్డినేటర్

నూరు శాతం ఫలితాలు..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్ష ఫలితాలలో రాకేష పబ్లిక్ స్కూల్ నూటికి నూరు శాతం ఫలితాలను సాధించిందని డైరెక్టర్ ఎన్వీ. రావు పేర్కొన్నారు. 587 మార్కులతో ఎండీ వజిహ తరుణ్, 577 మార్కులతో ఎస్. జ్యోత్స్న అపర్ణ, 569 మార్కులతో ఎండీ అహ్మద్‌లు సత్తా చాటారన్నారు. ఈ సందర్భంగా స్కూల్ విద్యార్థులు కేటీ రోడ్డుపై బాణాసంచా కాల్చి వేడుకలను నిర్వహించారు.

98 శాతం ఉత్తీర్ణత..

చిట్టినగర్(విజయవాడపశ్చిమ): పదో తరగతి పరీక్ష ఫలితాలలో చిట్టినగర్ శ్రీగౌతమ్ 98 శాతం ఉత్తీర్ణత సాధించిందని స్కూల్ అధినేత నల్లాని సూర్యారావు పేర్కొన్నారు. 98 శాతం ఉత్తీర్ణతతో ఈ. శరణ్య 591, ఎస్. కీర్తి 587 మార్కులు, వి. ఈశ్వరి 580 మార్కులను సాధించారన్నారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ తులసీ, శ్రీరామ్, ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అల్జీ నివారణకు ప్రత్యేక చర్యలు

హెడ్ వాటర్ వర్క్స్ సందర్శనలో కమిషనర్ ధ్యానచంద్ర



హెడ్ వాటర్ వర్క్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కమిషనర్ ధ్యానచంద్ర

భవానీపురం(విజయవాడపశ్చిమ): విద్యాధరపురంలోని డాక్టర్ కేఎల్ రావు మున్సిపల్ హెడ్ వాటర్ వర్క్స్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర బుధవారం సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి వేసవిలో ఉష్ణోగ్రతలు పెరిగి నీటిలో అల్జీ విపరీతంగా పెరుగుతుందని, తద్వారా నీటిలో తేలియాడే పదార్థాలు అధికం కావడం, ఫిల్టర్ బెడ్స్‌లో నీటి ఫిల్టరేషన్ రేటు పడిపోతుందని వివరించారు. దీని వల్ల నీటి రంగు మారి, దుర్వాసన వస్తుందని చెప్పారు. దీనిని నివారించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. ఇన్‌టేక్ వెల్ వద్ద అల్జీ ప్రవేశాన్ని నివారించేందుకు, అలాగే నీటిలో ఆక్సిజన్ స్థాయిని పెంచి దుర్వాసన తగ్గించేందుకు కృష్ణానదిలో పెడల్ ఏరేటర్స్‌ను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. ఇన్‌టేక్ వెల్ చుట్టూ చిన్న రంధ్రాలు ఉన్న క్లాత్‌ను ఏర్పాటు చేయడం ద్వారా తేలియాడే పదార్థాలు, అల్జీ, చిన్న చేపలు ప్రవేశించకుండా అడ్డుకుంటున్నారని తెలిపారు. నీటి కాలుష్యాన్ని నియంత్రించేందుకు పంపిణీ లైన్లను క్రమంగా స్కౌరింగ్ చేయడాన్ని పెంచారని చెప్పారు. ప్రస్తుతం హెడ్ వాటర్ వర్క్స్‌లో క్లియర్ వాటర్ ఉత్పత్తి పరిమాణం 185 ఎంఎల్‌డీ నుంచి 204 ఎమ్ఎల్‌డీకి పెరిగిందన్నారు. తద్వారా నగరానికి తాగునీటి సరఫరా మరింత మెరుగైందని తెలిపారు.

డ్రెయిన్లలో డీసిల్టింగ్ పనులు వేగవంతం

సిబ్బందికి వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర ఆదేశం



డీసిల్టింగ్ పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

పటమట(విజయవాడతూర్పు): నగరంలోని అన్ని ప్రాంతాల్లో ఉండే డ్రెయిన్లలో తప్పనిసరిగా డీసిల్టింగ్ పనులు చేయట్టాలని వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. నగర పర్యటనలో భాగంగా ఆయన ఎక్సెల్ ప్లాంట్, రాధానగర్ డ్రెయిన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద రోడ్ ఔట్ ఫాల్ డ్రెయిన్, సింగ్ నగర్ ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఎక్సెల్ ప్లాంట్‌లో వ్యర్థాలు అన్ని ఎప్పటికప్పుడు తొలగిస్తూ జిందాల్ కంపెనీకి పంపించాలన్నారు. రాధానగర్ డ్రెయిన్ చిన్నగా ఉండటం వల్ల వ్యర్థాలు పేరుకుపోయినచో, వర్షపు నీటి నిల్వలు వెంటనే రోడ్డుపైకి వచ్చే అవకాశాలు ఉన్నందున దానిని పెద్దది చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నగర శివారు లైన ఇన్నర్ రింగ్ రోడ్డు, ముస్తాబాద, రోడ్ ఔట్ ఫాల్ డ్రెయిన్ డీసిల్టింగ్ పనులను శరవేగంగా చేయాలని, రానున్న వర్షాకాలంలో వర్షపునీటి నిల్వలు రోడ్డుపైకి రాకుండా ఉండాలంటే ఇది తప్పనిసరని అన్నారు. పర్యటనలో ఇన్‌చార్జ్ చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల కృష్ణ నాయక్, ఎస్ఈ (వర్క్స్) పి. సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాసరెడ్డి, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాస్ పాల్గొన్నారు.

లూపింగ్ నెట్‌వర్క్‌తో కొండ ప్రాంతాలకు నీటి సరఫరా

భవానీపురం(విజయవాడపశ్చిమ): కొండ ప్రాంతాలకు లూపింగ్ నెట్ వర్క్ డిజైన్‌తో నీటి సరఫరా చేస్తున్నట్లు మైసూర్ కార్పొరేషన్ డెప్యూటీ కమిషనర్ (డెవలప్‌మెంట్) కేజే సింధు తెలిపారు. దక్షిణాది రాష్ట్రాల స్టడీ టూర్‌లో భాగంగా ఫ్లోర్ లీడర్ వెంకట సత్యనారాయణ పర్యవేక్షణలో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ కార్పొరేటర్ల బృందం బుధవారం మైసూర్ నగరపాలక సంస్థ జోనల్ కార్యాలయంలో సమావేశమయ్యారు. సమావేశంలో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా 84 డివిజన్లు, 9 జోన్లు కలిగిన మైసూర్ కార్పొరేషన్ పరిపాలన విధానం, మంచి నీటి సరఫరా, పారిశుద్ధ్య నిర్వహణ, వివిధ ప్రాజెక్ట్‌ల అమలు, పార్క్‌ల నిర్వహణ, కాలుష్య నివారణకు తీసుకున్న చర్యల గురించి సింధు వివరించారు. అదే విధంగా ప్రజా సమస్యల పరిష్కార విధానం, సంక్షేమ పథకాలు తదితర అంశాలకు సంబంధించిన వివరాలను అధికారులు సమగ్రంగా తెలియజేశారు. ఈ సందర్భంగా పలు కార్పొరేషన్ల అభివృద్ధి పనుల పరిశీలనలో భాగంగా తాము ఇక్కడకు రావడం సంతోషంగా ఉందని కార్పొరేటర్ల బృందం పేర్కొంది. విజయవాడ నగరంలో అమలు చేస్తున్న పలు కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అక్కడి అధికారులకు వివరించారు.



మైసూర్‌లో హెడ్ వాటర్ వర్క్స్‌ను పరిశీలిస్తున్న వీఎంసీ కార్పొరేటర్ల బృందం

నెట్ వర్క్ డిజైన్‌తో..

అనంతరం మైసూర్ రామస్వామి సర్కిల్‌లోగల 45ఎంఎల్‌డీ వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్‌కు కావేరీ డ్యామ్ నుంచి రా వాటర్ పంపింగ్ చేసుకుని, అక్కడ శుద్ధి చేసిన తర్వాత ప్రజలకు రక్షిత మంచినీటిని అందిస్తున్నామని వారు చెప్పారు. ఈ విధంగానే నాలుగు ప్రదేశాల్లో ట్రీట్‌మెంట్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విజయవాడ నగరపాలక సంస్థ పరిధిలో కొండ ప్రాంతాలు ఎక్కువగా ఉన్నందున ఆ నెట్ వర్క్ డిజైన్‌ను ఇక్కడ అమలు చేస్తే ప్రజలకు నీటి ఇబ్బందులు లేకుండా చూడవచ్చని విజయవాడ కార్పొరేటర్ల బృందం అభిప్రాయపడింది.